epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

సంపుటి: 02
సంచిక:39

24 క్యారెట్లు 105,457.00 | కిలో వెండి 1,20,547.00 | chourastha Digitals | 25.09.2026 శుక్రవారం, హైదరాబాద్

అణచివేతను ప్రతిఘటించడం నిజమైన దేశభక్తుడి కర్తవ్యం. దేశం నాకేమిచ్చిందని కాదు, దేశానికి నేనేం చేయగలనని ఆలోచించాలి. న్యాయం కోసం పోరాడే వారినే చరిత్ర గుర్తుపెట్టుకుంటుంది

**మేడమ్ కామా,**
స్వాతంత్ర్య సమరయోధురాలు



## ఆస్పత్రుల్లో భద్రతా చర్యలు
# పాటించాల్సిందే

- సమగ్ర గైడ్‌లైన్స్, చెక్‌లిస్ట్‌తో జీవో
- నెలలోగా ప్రభుత్వాస్పత్రుల్లో ఫైర్, ఎలక్ట్రికల్, స్ట్రక్చరల్ ఆడిటింగ్
- ఆరు నెలలకోసారి విధిగా నిర్వహించాలి
- అందుకోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి
- జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మెన్‌గా, రాష్ట్ర స్థాయిలో ఆరోగ్య శాఖ మంత్రి చైర్మెన్‌గా కమిటీలు
- సమీక్షలో మంత్రి దామోదర రాజనర్సింహ



**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆస్పత్రుల్లో ఫైర్, ఎలక్ట్రికల్, స్ట్రక్చరల్ సేఫ్టీలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇక నుంచి ఫైర్, ఎలక్ట్రికల్ సేఫ్టీలపై ప్రతి ।మిగతా 2 లో।

ప్రతి ఆస్పత్రి కూడా ఫైర్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ మెయింటనెన్స్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించేలా, అన్ని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లోనూ ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను పటిష్టంగా అమలు చేసేలా సమగ్ర గైడ్‌లైన్స్ రూపొందించాలని అధికారులను రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అగ్ని ప్రమాదాల నివారణతో పాటు అత్యవసర పరిస్థితుల్లో రోగులు, సిబ్బందిని సురక్షితంగా తరలించేలా వ్యవస్థలను బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో నెల రోజుల్లో ఫైర్, ఎలక్ట్రికల్, స్ట్రక్చరల్ సేఫ్టీల ఆడిట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై
# అభిశంసన!



**రెండు సభల్లో నోటీసులకు ఇతర పార్టీలతో సంప్రదింపులు**

- సర్‌పై ఈసీలో విభేదాల నివేదికల నేపథ్యంలో నిర్ణయం
- ఈ ఏడాదిలో జ్ఞానేష్ కుమార్ తొలగింపునకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు
- ప్రతిపక్షాలు ప్రయత్నించడం ఇది మూడోసారి
- వచ్చే రెండు వారాల్లో నోటీసులు సమర్పించే అవకాశం
- ఓట్ల చోరీ'పై సమగ్ర దర్యాప్తు జరపాలి
- ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ

> ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ ప్రతిపక్షాలు మరోసారి పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతు న్నాయి. ఈ మేరకు లోక్‌సభ, రాజ్యసభల్లో నోటీసులు ఇవ్వడానికి కాంగ్రెస్ ఇతర ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు ఆయా పార్టీల వర్గాలు వెల్లడించాయి.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** ఈ ఏడాదిలో జ్ఞానేష్ కుమార్ తొలగింపునకు ప్రతిపక్షాలు ప్రయత్నించడం ఇది మూడోసారి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (సర్)కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషన్‌లోని ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు వచ్చిన తాజా నివేదికలు ఈ తాజా ప్రయత్నానికి కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చే రెండు వారాల్లో నోటీసులు సమర్పించే ।మిగతా 2 లో।

# సుప్రీం తీర్పు చెంపపెట్టు

- పార్టీ ఫిరాయించిన మిగతా ఎమ్మెల్యేలకూ ఇదే పరిస్థితి
- నాపై క్షుద్ర పూజలంటూ తప్పుడు ప్రచారం
- మహేశ్‌కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై పరువునష్టం కేసు దాఖలు
- ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులా
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకోవడం తప్ప
- ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదు
- మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు



> క్షుద్ర పూజలు చేశారంటూ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నేతలు బి. మహేశ్‌కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై పరువునష్టం కేసు దాఖలు చేశామని, ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు అన్నారు. తనపై తప్పుడు ప్రచారం చేశారంటూ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌కు ఇప్పటికే లీగల్ నోటీసులు పంపించారు. అలాగే కోర్టులో పరువు నష్టం దావా వేశారు.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** ఈ మేరకు గురువారం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు స్వయంగా హాజరైన హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తనపై చేసిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలతో కోర్టును ఆశ్రయించామని, వచ్చే బుధవారం మరోసారి విచారణకు పిలిచారని, ।మిగతా 2 లో।



## దశాబ్దాల సమస్యలకు చెక్

- ఒక్కొక్కటిగా ప్రజాసమస్యలకు పరిష్కారం
- 22ఏ సమస్యలకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారం
- జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మున్సిపాల్టీల్లోని ప్రజలకు ఉపశమనం
- ఇండ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం
- ఉత్తర్వులు జారీ చేశాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

2లో

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- భారత ప్రజాస్వామ్యానికి ఆయన పెను ప్రమాదం
- 48 గంటల్లో సమయం ఇస్తున్నాం
- లేకుంటే దేశవ్యాప్తంగా ఆందోళన
- సీఈసీకి సీజేపీ అల్టిమేటం
- జంతర్‌మంతర్-2.0' చేపడతామన్న సీజేపీ నేతలు - అభిజీత్ దీప్కే, సౌరవ్ దాస్, అశుతోష్ రంకా



2లో




# దానంకి సుప్రీం కోర్టులోను నిరాశే

- దానంనాగేందర్‌పై పిటిషన్ కొట్టివేత
- హైకోర్టు తీర్పులో జోక్యానికి సుప్రీం నిరాకరణ
- పార్టీ ఫిరాయింపుపై వాడీవేడిగా వాదనలు
- దానం నాగేందర్ చర్యను బీఆర్ఎస్ క్షమించలేదు
- ఆయనపై అనర్హత పిటిషన్ దాఖలు చేసింది కూడా బీఆర్ఎస్



5లో



## కొడుకు మోసం, తండ్రికి శాపం

- దారుణంగా హత్య చేసిన దుండగుడు
- రక్తపు మడుగులో కుప్పకూలిపోయిన శ్రీనివాస్
- సికింద్రాబాద్‌లో ఘటన
- నిందితుడ్ని పోలీసులు అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు
- ఈ హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణం
- పోలీసుల విచారణలో వెల్లడి

2లో

# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన!



**తరువాయి భాగం**

అవకాశం ఉందని సమాచారం. ఎన్నికల జాబితాల్లో పేర్ల నమోదు, తొలగింపు, పునరుద్ధరణ, ఫారం 6లో మార్పులు, ఓటర్ల జాబితా డేటాబేస్ నియంత్రణ తదితర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు జాతీయ మీడియా పరిశోధనాత్మక కథనం పేర్కొంది. మరోవైపు, ఎన్నికల సంఘం మాత్రం కమిషన్‌లో నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకున్నట్లు భావించడాన్ని ఖండించింది. భిన్నాభిప్రాయాలు, సూచనలు సంస్థాగత చర్చల్లో సహజమేనని పేర్కొంది. గతేడాది కాలంలో సర్‌తో సహా తీసుకున్న నిర్ణయాలన్నీ పూర్తి కమిషన్ ఏకగ్రీవంగా తీసుకున్నవేనని స్పష్టం చేసింది. అధికారిక ఉత్తర్వులు, పరిపాలనా ఆదేశాలు చట్టబద్ధ విధానాలకు అనుగుణం గానే ఉన్నాయని తెలిపింది. జ్ఞానేశ్‌కుమార్ తొలగింపునకు ప్రతి పక్షాలు ఇప్పటికే రెండుసార్లు ప్రయత్నిం చాయి. మార్చి 12న లోక్‌సభలో 130 మంది ఎంపీలు, రాజ్యసభలో 63 మంది ఎంపీలు సంతకాలతో తొలగింపు నోటీసులు ఇచ్చారు. అయితే ఏప్రిల్ 6న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, అప్పటి రాజ్యసభ చైర్మెన్ సీ పీ రాధాకృష్ణన్ ఆ నోటీసులను స్వీకరిం చేందుకు నిరాకరించారు. ఆరోపణలు రాజ్యాంగపరంగా నిర్దేశించిన ప్రాథమిక ప్రమాణాలను అందుకోలేదని వారు పేర్కొన్నారు. ఆ తరువాత ఏప్రిల్ 24న 73 మంది ప్రతిపక్ష రాజ్యసభ సభ్యుల సంతకాలతో మరో నోటీసు సమర్పించారు. ఇందులో తొమ్మిది ఆరోపణలను ప్రస్తావించినట్టు నివేదికలు తెలిపాయి. ఈ నోటీసు రాజ్యసభ చైర్మెన్ వద్ద ఇంకా పెండింగ్‌లో ఉంది. '

**ఓట్ల చోరీ'పై సమగ్ర దర్యాప్తు జరపాలి :**

రాహుల్‌గాంధీ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు, ఓటర్ల జాబితా సవరణపై ఎన్నికల కమిషన్‌లోనే విభేదాలు తలెత్తినట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో ఆయన గురువారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో జరిగిన ఎన్నికల్లో 'ఓట్ల చోరీ' జరిగిందని ఆరోపించారు. ఓటర్ల జాబితాల్లో పేర్ల తొలగింపు, చేర్పులు, ఇతర మార్పుల ద్వారా ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారని ఆయన విమర్శించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, విశ్వసనీయతపై ప్రజల్లో తలెత్తుతున్న ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలని, ఓటు హక్కు విషయంలో ఎలాంటి సందేహాలకు తావులేకుండా వ్యవహరించాలని రాహుల్‌గాంధీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపైనా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌కు కేంద్రంలోని పెద్దల మద్దతు ఉందని ఆరోపించారు. ఎన్నికల్లో వరుస విజయాలు సాధిస్తున్న తీరు, సాధారణంగా కనిపించే ప్రభుత్వ వ్యతిరేకత (యాంటీ ఇన్‌కంబెన్సీ) కొన్ని ఎన్నికల్లో కనిపించకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'ఓట్లే చోరీకి గురైతే, ఆ ఓట్లతో ఎన్నికైన ప్రజాప్రతినిధులు చేసే చట్టబద్ధతపైనా ప్రశ్నలు తలెత్తుతాయి' అని వ్యాఖ్యానించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని అన్నారు. రాజ్యాంగంలో ప్రత్యేక విధానం ప్రధాన ఎన్నికల కమిషనర్ తొలగింపు నకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రత్యేక విధానాన్ని నిర్దేశిస్తుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే విధానంలోనే సీఈసీని కూడా తొలగించాల్సి ఉంటుంది. తొలగింపు తీర్మానానికి లోక్‌సభలో కనీసం 100 మంది, రాజ్యసభలో కనీసం 50 మంది సభ్యుల మద్దతు అవసరం. నోటీసును సభాధ్యక్షుడు లేదా చైర్మెన్ స్వీకరించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. విచారణ దశకు చేరితే రెండు సభలు అదే సమావేశంలో మొత్తం సభ్యుల మెజారిటీతో పాటు హాజరై ఓటు వేసిన సభ్యుల్లో కనీసం మూడింట రెండొంతుల మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదించాల్సి ఉంటుంది. 'నిరూపిత దుష్ప్రవర్తన లేదా అసమర్థత' ఆధారంగానే తొలగింపు ప్రక్రియ కొనసాగుతుంది.

## ఆస్పత్రుల్లో భద్రతా చర్యలు పాటించాల్సిందే



**తరువాయి భాగం**

ఆరు నెలలకోసారి, భవనాల నిర్మాణ పటిష్టతపై ఏడాదికోసారి ఆడిట్‌లు నిర్వహించాలనీ, ఆడిట్‌లో గుర్తించిన లోపాలను నివేదికలకే పరిమితం చేయకుండా నిర్దిష్ట టైమ్‌బాండ్‌తో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**సమగ్ర గైడ్‌లైన్స్, చెక్‌లిస్ట్‌తో జీవో**

ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీకి సంబంధించి అన్ని అంశాలను కవర్ చేసేలా సమగ్ర గైడ్‌లైన్స్, స్టాండర్డ్ చెక్‌లిస్ట్‌తో ప్రత్యేక జీవో జారీకి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఫైర్ అలారం, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్, హైడ్రెంట్స్, స్ప్రింక్లర్ సిస్టమ్, ఫైర్ వాటర్ లైన్లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్స్, ఎమర్జెన్సీ లైటింగ్, ఎలక్ట్రికల్ ప్యానెల్స్, వైరింగ్, డీజీ సెట్లు, ఏసీ యూనిట్లు, ఆక్సిజన్ సప్లై వ్యవస్థలు తదితర అంశాలతో పాటు ఎమర్జెన్సీ రెస్పాన్స్, ఎవాక్యుయేషన్ ప్రోటోకాల్స్‌ను కూడా చెక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. ప్రతి ఆస్పత్రిని కూడా సెన్సిటివ్, నాన్‌సెన్సిటివ్ జోన్లుగా విభజించాలనీ, సెన్సిటీవ్ జోన్లలో ప్రత్యేక భద్రతా ప్రమాణాలను అమలు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రి సిబ్బందికి క్రమం తప్పకుండా మాక్ డ్రిల్స్ నిర్వహించి శిక్షణ ఇవ్వాలని సూచించారు.

**జిల్లా స్థాయిలో మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీలు...రాష్ట్ర స్థాయిలో మానిటరింగ్ కమిటీ**

ఫైర్, ఎలక్ట్రికల్, స్ట్రక్చరల్ సేఫ్టీ అంశాలపై జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మెన్‌గా ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలనీ, అందులో డీఎంహెచ్‌వో, ఎస్‌ఈ, డీఎఫ్‌ఓ, అగ్నిమాపక, ఆర్‌అండ్‌బీ శాఖల జిల్లా అధికారులు భాగస్వాములై ఆస్పత్రులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో ఆరోగ్యశాఖ మంత్రి చైర్మెన్‌గా ఆయా శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని అన్ని ఆస్పత్రుల్లో ఫైర్ సేఫ్టీకి సంబంధించిన పరిస్థితి, ఆడిట్‌ల పురోగతి, గుర్తించిన లోపాలు, వాటి పరిష్కారం, అత్యవసర అవసరాలకు సంబంధించిన నివేదికలను రాష్ట్ర స్థాయి కమిటీ సమీక్షించేలా వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు.ప్రతి ఆస్పత్రి కూడా అగ్నిమాపక, విద్యుత్ పరికరాల పర్యవేక్షణ కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించేలా మార్గదర్శకాలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, టీజీ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేశ్ పాటిల్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో +**

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అల్టిమేటం జారీ చేసింది. 48 గంటల్లోగా రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. లేకపోతే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని, ఢిల్లీలో 'జంతర్‌మంతర్ 2.0' పేరుతో నిరవధిక నిరసనకు దిగుతామని హెచ్చరించింది. గురువారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే, కో కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా మాట్లాడారు. చీఫ్ ఎలక్షన్ కమిటీసనర్ అతిపెద్ద జాతి వ్యతిరేకి అని, జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, భారత ప్రజాస్వామ్యానికి ఆయన పెను ప్రమాదంగా మారినట్టు విమర్శించారు. ప్రజాస్వామ్య సూత్రాలకు వ్యతిరేకంగా ఆయన వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం ఓటర్ల హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. సీఈసీగా ఆయన బాధ్యతలు చేపట్టిన తరువాతే, ఎవరికి ఓటు రావాలి, ఎవరికి ఓటు వద్దు అన్ని విషయాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తోందని, ప్రజాస్వామ్యం అంటే ఇదేనా అంటూ ప్రశ్నించారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మోడీ ఇంటి చప్రాసీగా మారారని మండిపడ్డారు. ఈవీఎంలను హ్యాక్ చేయవచ్చని, కాబట్టి బ్యాలెట్ పేపర్లను ఉపయోగించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఎన్నికలు బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహిం చబడుతున్నాయని గుర్తు చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించారంటూ ధ్వజమెత్తారు. 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ తొలగింపులపై స్పష్టత ఇవ్వాలని, ప్రభావిత ఓటర్లకు సమర్థవంతమైన పునఃపరిశీలన అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. 13 కోట్ల మంది ఓటర్లను తొలగించడమేమీ చిన్న సంఖ్య కాదు అని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ, ప్రతిపక్షాల మధ్య తేడా కేవలం 2 శాతం ఓట్లు మాత్రమే అని తెలిపారు. 13 కోట్ల మంది ఓటర్లను డిలీట్ చేయడం అంటే, దాదాపు 13 నుంచి 14 శాతం ఓట్లను తొలగించడమే అవుతుందని అన్నారు. ఆ 2 శాతం వ్యత్యాసాన్ని పెంచేందుకు జ్ఞానేశ్ కుమార్ ప్రయత్నాలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు.

**మూడు ప్రధాన డిమాండ్లు**

సీఈసీ రాజీనామాతో పాటు ఎస్ఐఆర్‌కు సంబంధించిన ప్రక్రియపై సీజేపీ పలు డిమాండ్లు చేసింది. సీఈసీపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని, సర్‌లో మరిన్ని పేర్ల తొలగింపును నిలిపివేయాలని కోరింది. జనవరి 2025 ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా ఉంచి, పేర్ల తొలగింపులను ధ్రువీకరించే వరకు రికార్డులను భద్రపరచాలని డిమాండ్ చేసింది. అలాగే సర్‌కు సంబంధించిన రికార్డులను సుప్రీంకోర్టుకు లేదా న్యాయపరమైన పర్యవేక్షణలోని స్వతంత్ర విచారణకు అప్పగించాలని కోరింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేసి, విస్తృత సంస్థాగత, పౌర సమాజ భాగస్వామ్యంతో కొత్త విధానాన్ని తీసుకురావాలని సీజేపీ కోరింది. తమ డిమాండ్లపై 48 గంటల్లో సిఈసి స్పందించకపోతే దేశవ్యాప్త ఆందోళనకు దిగుతామని సీజేపీ నేతలు ప్రకటించారు. ఢిల్లీలో గతంలో నిర్వహించిన నిరసనల తరహాలో 'జంతర్‌మంతర్ 2.0' చేపడ తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాల సవరణపై తలెత్తిన సందేహాలకు ప్రజలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని సీజేపీ డిమాండ్ చేశారు. బిజెపికి స్పష్టమైన మెజారిటీ రాకపోవచ్చనే భయంతోనే ప్రాంతీయ శక్తులను బలహీనపరి చేందుకు ఈ వ్యూహం పన్నారని విమర్శించారు. పశ్చిమబెంగాల్లో మమత బెనర్జీ నియోజకవర్గంలో 51 వేల ఓట్లు తొలగించారని, ఆమె కేవలం 15 వేల ఓట్లతో ఓటమి పాలైందని అన్నారు. తమిళనాడు మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నియోజకవర్గంలో లక్ష ఓట్లు తొలగించారని, అక్కడ ఆయన కేవలం తొమ్మిది వేలతో ఓటమి చెందారని తెలిపారు. ఢిల్లీలో కూడా ఇదే జరిగిందని చెప్పారు. అరవింద్ కేజ్రీవాల్ పోటీ చేసే నియోజకవర్గంలో 40 వేల ఓట్లు తొలగించారని, ఆయన కేవలం నాలుగు వేలు ఓట్లతోనే ఓటమి చెందారని తెలిపారు. ప్రతిపక్ష నేతలను దెబ్బతీసేలా ఓట్ల తొలగింపులు జరుగుతుంటే, దానిని స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికలు అని ఎలా అంటారని ప్రశ్నించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా విషయంలో తాము వెనక్కు తగ్గేదే లేదని తేల్చి చెప్పారు.

## దశాబ్దాల సమస్యలకు చెక్

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**



దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఏ సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 16న శాసనసభలో ఇచ్చిన హామీ మేరకు సహచర మంత్రులతో చర్చించి 22ఏ సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించిందని పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 22ఏలో ఉన్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ సంస్థల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లు, ఇండ్లు, ఫ్లాట్లకు నిర్దేశిత నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పిస్తూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, మున్సిపాల్టీలు, డీటీసీపీ లేదా ఇతర పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే లేఅవుట్, భవన నిర్మాణం లేదా అపార్ట్‌మెంట్ అనుమతులు పొందిన ఆస్తులకు ఈ నిర్ణయం వర్తిస్తుందని తెలిపారు. అనుమతి పొందిన అనంతరం జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ తప్పనిసరిగా దరఖాస్తుదారులు సమర్పించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారానికి కమిటీ ఈ ప్రక్రియలో ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా రిజిస్ట్రార్, హెచ్ఎండీఏ/పురపాలక సంస్థ/గ్రామీణ స్థానిక సంస్థల ప్రతినిధి సభ్యులుగా ఉంటారని తెలిపారు.22ఏ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇప్పటికే అమల్లోకి వచ్చిన నిర్ణయాలే నిదర్శనమని పేర్కొన్నారు.రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లోని దాదాపు 64 కాలనీల ఇండ్ల క్రమబద్ధీకరణ సమస్యకు జీవో 118కు అనుగుణంగా మెమో జారీ చేశామని తెలిపారు, దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి కార్మికుల ఇండ్ల క్రమబద్ధీకరణ సమస్యను కూడా ప్రభుత్వం జీవో 76 ద్వారా పరిష్కరించే దిశగా కీలక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. భూమి, ఇల్లు వంటి అంశాల్లో ప్రజలు ఏండ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితికి ముగింపు పలకడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపశమనం కలిగేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని తెలిపారు.22ఏలోని అన్ని భూములనూ ఒకే గాటన కట్టకుండా, భూమి స్వభావం, అందుబాటులో ఉన్న రికార్డులు, చట్టబద్ధమైన అనుమతులు, న్యాయపరమైన అంశాలను పరిశీలించి అర్హమైన సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు.



## సుప్రీం తీర్పు చెంపపెట్టు

**తరువాయి భాగం**

స్టేట్‌మెంట్లు నమోదు చేస్తామని చెప్పినట్టు వెల్లడించారు. దేవాలయాలకు వెళితే క్షుద్ర పూజలు చేశారంటూ ఇష్టానుసారంగా మాట్లాడు తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నా రని, ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు గురించి అడిగితే తమపై లేనిపోని ఆరోపణలు చేస్తూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతు న్నారని అన్నారు. శాసనసభలో కూడా అనేక అంశాలపై తప్పుడు వివరాలు చెబుతున్నా రని, సభా హక్కుల ఉల్లంఘనపై స్పీకర్‌కు పలు మార్లు నోటీసులు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు.మూడేండ్లు గడిచినా డిప్యూటీ స్పీకర్ నియామకం జరగలేదని, సభా హక్కుల ఉల్లంఘన ఫిర్యాదులను పరిశీలించాల్సిన ప్రివిలేజెస్ కమిటీకి కూడా చైర్మెన్ లేరని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకోవడం తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో నీటి, విద్యుత్ సమస్యలు నెలకొన్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా తమకు న్యాయస్థానాలపై నమ్మకం ఉందని తెలిపారు. దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు వంటిదని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న వారికి ఈ తీర్పు గుణపాఠమని అన్నారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని దేశవ్యాప్తంగా తిరిగే రాహుల్‌గాంధీకి తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రాజ్యాంగంపై కాంగ్రెస్‌కు నిజంగా గౌరవం ఉంటే పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. దానం నాగేందర్ విషయంలో సుప్రీంకోర్టు తీర్పుతో స్పీకర్ నిర్ణయంపై తమ వాదనకు బలం చేకూరిందని చెప్పారు. మిగతా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల విషయంలోనూ ఇదే పరిస్థితి ఎదురవుతుందన్నారు

## కొడుకు మోసం, తండ్రికి శాపం

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

అప్పు తీసుకున్నది ఒకరు. ప్రాణాలు వదిలింది మరొకరు. తప్పు చేసిన వాడు పారిపోతే ఏ పాపం ఎరుగని ఓ వృద్ధుడి ప్రాణాలు గాల్లో కలిశాయి. నడిరోడ్డుపై నెత్తురుటేరులు పారాయి. డబ్బు కోసం మనిషి ఎంతటి కిరాతకానికైనా ఒడిగడతాడు అనడానికి సికింద్రాబాద్‌లో జరిగిన ఈ దారుణ హత్యే ప్రత్యక్ష ఉదాహరణ.



డబ్బు కోసం మనిషి ఎంతటి కిరాతకానికైనా ఒడిగడతాడనడానికి ఈ ఘటనే సజీవ సాక్ష్యం. సికింద్రాబాద్ పరిధిలోని చిలకలగూడ మైలార్‌గడ్డలో ఇమ్మడి శ్రీనివాస్ అనే వృద్ధుడు తన ద్విచక్ర వాహనం మీద బయటకు వచ్చాడు. సమీపంలో ఉన్న వైన్ షాపుకు వెళ్లి వస్తుండగా అకస్మాత్తుగా ఓ వ్యక్తి అతనిపైకి దూసుకొచ్చాడు. కత్తితో విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు. ఆ దెబ్బకు రక్తపు మడుగులో శ్రీనివాస్ కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే ఆయన్ని ఆర్టీసీ ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం శ్రీనివాస్‌ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే అతడి ప్రాణాలు గాల్లో కలిశాయి.నడిరోడ్డుపై జరిగిన ఈ హత్యోదంతంతో చిలకలగూడ పోలీసులు రంగంలోకి దిగారు. వయసు పైబడిన శ్రీనివాస్‌ని అంత కిరాతకంగా చంపాల్సిన అవసరం ఎవరికి ఉంది? ఎవరితోనైనా పాత పగలు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీ కెమెరాలు, ఫోన్ కాల్ డేటాను జల్లెడ పట్టారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడి ఆచూకీ గుర్తించారు. హత్య జరిగిన 24 గంటల్లోపే ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన మహమ్మద్ నిజాముద్దీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయి.

చనిపోయిన శ్రీనివాస్‌కు, నిందితుడు నిజాముద్దీన్‌కు నేరుగా ఎలాంటి శత్రుత్వం లేదు. అసలు కథ శ్రీనివాస్ కుమారుడు సుమన్ దగ్గర మొదలైంది. నిజాముద్దీన్, సుమన్‌కి మధ్య ఆర్థిక లావాదేవీలు ఉండేవి. షేర్ మార్కెట్ ట్రేడింగ్‌లో సుమన్ భారీగా డబ్బులు పోగొట్టుకున్నాడు. అప్పుల ఊబిలో కూరుకుపోయి 2023 నవంబర్‌లో ఎవరికీ చెప్పకుండా ఇల్లు వదిలి పారిపోయాడు. అప్పటి నుంచి తన డబ్బుల కోసం నిజాముద్దీన్, సుమన్ తండ్రి శ్రీనివాస్ చుట్టూ తిరగడం మొదలుపెట్టాడు. కోర్టులో సివిల్ కేసు కూడా వేశాడు. అయినా లాభం లేకపోవడంతో తీవ్ర అసహనానికి గురయ్యాడు. డబ్బు తీసుకున్న సుమన్ దొరక్కపోవడంతో ఆ కోపాన్ని తండ్రిపై చూపించి, కత్తితో పాశవికంగా హతమార్చినట్లు విచారణలో అంగీకరించాడు.

అప్పుల గొడవలో ఏ మాత్రం సంబంధం లేని వృద్ధుడిని పొట్టనబెట్టుకున్న నిజాముద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హత్యకు వాడిన కత్తి, ద్విచక్రవాహనం, రక్తపు మరకలు ఉన్న దుస్తులను సీజ్ చేశారు. ఆర్థిక లావాదేవీలు ఉంటే చట్టపరంగా లేదా కోర్టుల ద్వారా తేల్చుకోవాలి కానీ ఇలా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే జీవితాలు నాశనం అవుతాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. క్షణికావేశంలో విచక్షణ కోల్పోయి చేసిన తప్పు నిజాముద్దీన్ జీవితాన్ని కటకటాల పాల్జేస్తే ఏ పాపం ఎరుగని ఓ నిస్సహాయుడైన వృద్ధుడి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.



## ఆయిల్‌పామ్ సాగుకు ఇదే అనుకూల సమయం

- ఎఫ్ ఎఫ్ బి ధర రూ24,025/మెట్రిక్ టన్ను

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:**

పెద్దపల్లి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును మరింత విస్తరించేందుకు రైతులు ముందుకు రావాలని జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్‌పామ్ తాజా ఫ్రెస్ ఫ్రూటీ బుంచెస్ (ఎఫ్ ఎఫ్ బి) ధర మెట్రిక్ టన్నుకు రూ.24,025గా ఉందని,ఇది రైతులకు ప్రోత్సాహకరమైన ధర అని తెలిపారు.ఆయిల్‌పామ్ సాగు ద్వారా దీర్ఘ కాలికంగా స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని,ఇప్పటికే జిల్లాలో సాగు చేస్తున్న విజయ వంతమైన రైతుల తోటలను సందర్శించి వారి అనుభవాలను ఇతర రైతులు తెలుసుకోవాలని సూచించారు.క్షేత్రస్థాయిలో దిగుబడులు,మార్కెటింగ్,పంట నిర్వహణ రైతులకు లభిస్తున్న ప్రభుత్వ సహాయాన్ని ప్రత్యక్షంగా వివరించడం ద్వారా ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో మరింత నమ్మకం కల్పిస్తున్నట్లు తెలిపారు.ఆయిల్‌పామ్ సాగుకు మొక్కల సరఫరా,నాలుగు సంవత్సరాల పాటు తోట నిర్వహణ అంతర పంటలకు ఆర్థిక సహాయం,అలాగే డ్రిప్ నీటిపారుదలపై ప్రభుత్వ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. అయితే రైతులు తప్పనిసరిగా తగిన భూమి నిరంతర నీటి వసతి ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.చిన్న,సన్నకారు రైతులు,మహిళా రైతులు సాగుకు అనుకూలమైన భూమి కలిగిన రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నామని,ఆసక్తి ఉన్న రైతులకు భూమి అనుకూలత,నీటి వసతి,సాగు విధానం,ప్రభుత్వ సహాయం మార్కెటింగ్ తదితర అంశాలపై ఉద్యానశాఖ అధికారులు పూర్తి సమాచారం అందిస్తారని తెలిపారు.ప్రస్తుతం ఉన్న ప్రోత్సాహకరమైన ఎఫ్.ఎఫ్.బి ధర, ప్రభుత్వ సహాయం,నీటి వినియోగ సామర్థ్యం ఇప్పటికే విజయవంతంగా సాగు చేస్తున్న రైతుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని,అనుకూలమైన భూమి నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌పామ్ సాగును పరిశీలించాలని జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ తెలిపారు.ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు తమ పరిధిలోని హార్టికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ లు,హార్టికల్చర్ అధికారులు ఆయిల్‌పామ్ ఫీల్డ్ సిబ్బందిని సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.



## విద్యుత్ కార్మిక సంఘం–327 డివిజన్ కార్యదర్శిగా మధు

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**

ఐ ఎన్ టి యూ సీ అనుబంధ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం327 తొర్రూరు డివిజన్ కార్యదర్శిగా పసుపులేటి మధు ఎన్నికయ్యారు. డివిజన్ కేంద్రంలో గురువారం రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కంపెనీ ఉపాధ్యక్షులు కె. వీరసోములు, జిల్లా అధ్యక్షులు సలుగు నర్సయ్య, జిల్లా కార్యదర్శి పాము వెంకటేశ్వర్లు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ పాషా, డివిజన్ అధ్యక్షులు కేశబోయిన బోజాలు సమక్షంలో ఎన్నిక చేపట్టారు. పసుపులేటి మధు మాట్లాడుతూ... విద్యుత్ కార్మికుల సమస్యలపై అన్ని యూనియన్లను కలుపుకొని జెఏసి గా ఏర్పడి విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం సంఘ రాష్ట్ర సెక్రెటరీ జనరల్ శ్రీధర్ శ్రమిస్తున్నారని, ఆర్టిజన్ కార్మికులకు సర్వీస్ రూల్స్ వర్తించేలా విద్యుత్ కార్మిక సంఘం కృషి చేస్తుందన్నారు.

నాపై అచంచల విశ్వాసంతో ఎన్నికకు సహకరించిన సంఘ రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానని మధు తెలిపారు.



## డబుల్ ఇళ్లకు పునాది జలగం హయాంలోనే

- 30% పనులకే 7 ఏళ్లా..? జలగం యువసేన
- డబుల్ ఇళ్ల లాటరీ పారదర్శకమేనా? అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు!
- డబుల్ ఇళ్లపై జలగం యువసేన స్పష్టీకరణ
- పాత కొత్తగూడెం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు.
- జలగం వెంకట్రావు హయాంలోనే ప్రారంభమయ్యాయి 'జలగం యువసేన' స్పష్టీకరణ
- పాల్వంచ, పాత కొత్తగూడెం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై జలగం యువసేన ప్రకటన
- గతంలోనే 60-70% పనులు పూర్తి... మిగిలిన పనులకే 7 ఏళ్లు పట్టింది
- లాటరీ ప్రక్రియలో పారదర్శకతపై ప్రజలకు సమాధానం చెప్పాలి సయ్యద్ యాకూబ్ అలీ

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**



కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని పాల్వంచ, పాత కొత్తగూడెంలలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి 'జలగం యువసేన' గురువారం ఓ ప్రకటనలో స్పష్టీకరణ ఇచ్చింది.ఈ సందర్భంగా జలగం యువసేన ప్రతినిధి సయ్యద్ యాకూబ్ అలీ (సుజాతనగర్) మాట్లాడుతూ...పాత కొత్తగూడెంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం నాటి టీఆర్ఎస్ ప్రభుత్వంలో, శ్రీ జలగం వెంకట్రావు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. ఆ హయాంలోనే 60 నుండి 70 శాతం పనులు శరవేగంగా పూర్తయ్యాయని, అయితే కేవలం మిగిలిన 30 శాతం పనులు పూర్తి చేయడానికి ఈనాటి పాలకులు సుమారు 7 సంవత్సరాల సుదీర్ఘ సమయం తీసుకున్నారని విమర్శించారు.ఆనాడు జలగం వెంకట్రావు హయాంలో కొత్తగూడెం నియోజకవర్గం మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రజల, నిరుద్యోగ యువత అవసరాలకు తగినట్లుగా అనేక మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు అంకురార్పణ చేశామని తెలిపారు. అయితే నేడు అధికారంలో ఉన్నవారు ఆ నిర్మాణాల్లో అనవసర జాప్యం చేసుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా, తాజాగా నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లాటరీ విధానంలో నిజమైన నిరుపేదలకు పారదర్శకంగా ఇళ్లు అందాయా లేదా అనేది ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.జలగం యువసేన,సుజాతనగర్

# కన్నెత్తి చూస్తే కాటేసే చట్టాలేవి...?

- ముగ్గురు మంత్రులేరీ... ఆడపిల్లలకు రక్షణేదీ..?
- ఆడపిల్లలకు రక్షణ శూన్యం!
- కన్నెస్తే కాటేయాలి... భద్రత పెంచాలి!
- అనాథలా మారిన భద్రత... పాలకులు పడుకున్నారా....?
- కన్నెత్తి చూస్తే కాటెయ్యాలి.. రచ్చబండపైనే ఉరితీయాల్సిందే!
- ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో దహించుకుపోతున్న నిరసనాగ్ని జ్వాలలు!
- ఆడపిల్లల ప్రాణాలకు రక్షణ ఏది...?ఉరితీస్తేనే మృగాళ్లకు బుద్ధి...?
- ముగ్గురు మంత్రులూ సైలెంట్.. చట్టాలన్నీ వైలెంట్ పేపర్లకే పరిమితం!
- ముగ్గురు మంత్రులున్నా మారని పరిస్థితి
- ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా మరణశిక్ష విధించాలని డిమాండ్






**భద్రాద్రి కొత్తగూడెంబ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

రాజధాని నగరంలో ములకలపల్లి మండలంచౌటిగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ ఆడబిడ్డ ఊకే శిరీషపై జరిగిన దారుణ అఘాయిత్యం మరువక ముందే... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలానికి చెందిన మరో నిరుపేద ఆడబిడ్డ హరిణిపై జరిగిన ఘోరం యావత్ తెలంగాణ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.కష్టపడి చదువుకుని, కుటుంబ ఆర్థిక పరిస్థితులకు తోడుగా నిలవాలనే తపనతో ఉద్యోగాలు చేస్తున్న నిరుపేద అమ్మాయిలను నరరూప రాక్షసులు బలితీసుకుంటుంటే... ఈ సమాజం, ప్రభుత్వ యంత్రాంగం ఇంకా ఎంతకాలం మౌన ప్రేక్షక పాత్ర పోషిస్తాయని బాధితుల కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి.

**కాగితాలకే పరిమితమైన చట్టాలు!**

ఆడపిల్లలు స్వయం సమృద్ధి సాధించి, తమ కాళ్లపై తాము నిలబడాలని ఒకవైపు చెబుతున్న పాలకులు... వారికి కనీస రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. చట్టాలు కేవలం


24/09/2026 | Page No: 3
epaper.telanganachowrasta.com
తెలంగాణ చౌరస్తా
జనరల్ న్యూస్ 3
హరిణి అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి

పుస్తకాలకే పరిమితమవ్వడం వల్ల నేరస్థులలో భయం అన్నదే లేకుండా పోయింది. పక్క రాష్ట్రాల్లో తప్పు జరిగితే మరొకరు అలాంటి ఘాతుకానికి పాల్పడకుండా తక్షణమే కఠిన శిక్షలు అమలు చేస్తుంటే... ఇక్కడ మాత్రం కేంద్ర మంత్రుల కొడుకుల నుంచి సామాన్యుల వరకు అఘాయిత్యాలు చేస్తూనే ఉన్నారు.

**ముగ్గురు మంత్రులున్నా ఏదీ భద్రత?**

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఏకంగా ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, సొంత జిల్లా ఆడపిల్లలకు కనీస రక్షణ లేకుండా పోవడం పాలకుల అలసత్వానికి నిదర్శనమని ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. కంటికి





01/09/2026 | Page No: 4
epaper.telanganachowrasta.com
తెలంగాణ చౌరస్తా
గిరిజన బిడ్డ శిరీష కుటుంబానికి
న్యాయం చేయాలి



రెప్పలా కాపాడాల్సిన రక్షణ వ్యవస్థలు విఫలమవడంతో ఆడబిడ్డలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి."ఇది ఒక్క శిరీష, హరిణిల సమస్య మాత్రమే కాదు... రేపు మన ఇంటి ఆడబిడ్డకు ఈ గతి పట్టకూడదంటే ప్రభుత్వం తక్షణమే కంటికి కన్ను, పంటికి పన్నులాంటి కఠిన చర్యలు తీసుకోవాలి!"

**ప్రజా ఆగ్రహం – తక్షణ డిమాండ్లు:**

ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి శిరీష,హరిణి కేసుల విచారణను ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి రోజువారీ ప్రాతిపదికన విచారించాలి. నడిరోడ్డుపై ఉరిశిక్ష వేసి,మరొకడు ఆడబిడ్డ వైపు కన్నెత్తి చూడాలన్నా గుండెల్లో రైళ్లు పరిగెత్తేలా నిందితులను నడిరోడ్డుపై ఉరితీయాలి.కుటుంబాలకు న్యాయం చేసి,వారి కుటుంబాలకు తక్షణమే ఆర్థిక సహాయం అందించి,కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి. నేరస్థులకు తగిన రీతిలో బుద్ధి చెప్పకపోతే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రజా ఆగ్రహం ఉప్పెనలా ఎగిసిపడటం ఖాయమని స్పష్టమవుతోంది.



## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- పాఠశాల పిల్లలకు బెల్టులు పంపిణీ
- స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేష్

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని గంగారం పంచాయతీ పరిధిలో గల ఊషన్నపల్లి ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ సందర్శించారు.ప్రభుత్వం అందజేసిన ఉచిత బెల్టులను ఉపాధ్యాయులతో కలిసి పిల్లలకు అందజేశారు .ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు.విశేష బోధనానుభవం కలిగిన ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు చదువులో పిల్లల్ని అద్భుతంగా తయారు చేస్తున్నారన్నారు.పాఠశాల పిల్లలు వారి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను ఇతరులకు తెలియజేయాలని కోరారు.ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులు,అంకిత భావంతో పని చేస్తున్న టీచర్లు ఉన్నారని,గ్రామ ప్రజలు,పిల్లల తల్లిదండ్రులు వారి సేవలను వినియోగించుకోవాలని వెంకటేష్ కోరారు.అనంతరం ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులతో కలిసి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.విద్యారంగంలో వెంకటేష్ చేస్తున్న విశేష సేవలను కొనియాడారు.కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ చక్కటి పరిపాలనాదక్షుడని,మంచి సబ్జెక్టు టీచర్ అని,ముందుముందు మరెన్నో అవార్డులు పొందాలని ఈర్ల సమ్మయ్య ఆకాంక్షించారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ...ఊషన్నపల్లి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేస్తున్నామని,పాఠశాల పిల్లలకు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య,ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులు అమృత సురేష్ కుమార్,మంద శ్రీవాణి,ఎడ్ల స్రవంతి,పిల్లలు,పలువురు పాల్గొన్నారు.




## గుంజపడుగు హరిప్రసాద్‌కు ఘన సన్మానం

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

దళిత సేన జిల్లా నాయకులు చంటి శ్రీనివాస్ ఇటీవల నూతనంగా నియమితులైన ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కి మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు పిన్నింటి సంగీత రెడ్డికి,తెలంగాణ రక్షణ సేన నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్ లను తెలంగాణ రక్షణ సేన జిల్లా దళిత సేన నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు పాల్గొని గుంజపడుగు హరిప్రసాద్ కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా చంటి శ్రీనివాస్ మాట్లాడుతూ....తెలంగాణ రక్షణ సేన బలోపేతానికి గుంజపడుగు హరిప్రసాద్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ముఖ్యంగా దళితులు,బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం పార్టీ మరింత బలమైన పోరాటాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ...తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన తెలంగాణ రక్షణ సేన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని,దళితులు,బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేస్తామన్నారు. సామాజిక న్యాయం,సమాన అవకాశాలు,అణగారిన వర్గాల హక్కుల కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు.పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు మ్యాకల తిరుపతి,శ్రీరాముల రమేష్,ధర్మరెడ్డి,లింగంపల్లి శ్రీనివాస్,ఉల్లేంగుల నరేష్,లంక మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి భవన్ ముందు భారీ నిరసన ప్రదర్శన

- నాణ్యమైన బొగ్గు సరఫరా చేసి విద్యుత్ అంతరాయాలు నివారించాలి
- కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధుల డిమాండ్
- సంస్థ యాజమాన్యానికి విజ్ఞప్తి పత్రం సమర్పణ

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ చౌరస్తా :**




రాష్ట్రంలో విద్యుత్ కొరత ఏర్పడకుండా నాణ్యమైన బొగ్గును సరిపడా సరఫరా చేయాలని, అలాగే సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత్ రాష్ట్ర సమితి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. భారత్ రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ ఇచ్చిన పిలుపు మేరకు జరిగిన ఈ "సింగరేణి భవన్ ముట్టడి" కార్యక్రమంలో మాజీ మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు మరియు కార్మిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.సింగరేణి భవన్ ప్రాంగణంలో నిరసన తెలిపిన అనంతరం, ప్రజాప్రతినిధులు కార్మిక సంఘ నాయకుల బృందం సంస్థ ఉన్నతాధికారులతో చర్చలు జరిపి, తమ ప్రధాన డిమాండ్లతో కూడిన విజ్ఞప్తి పత్రాన్ని సంస్థ కార్యాచరణ సంచాలకులకు అందజేశారు.

***విద్యుత్ కోతల నివారణకు బొగ్గు పెంపు***

రాష్ట్రంలో విద్యుత్ కోతలు, నాణ్యతా లోపం వల్ల రైతులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు కావలసినంత నాణ్యమైన బొగ్గును సరఫరా చేసి రాష్ట్రంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి.67 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి సింగరేణి సంస్థకు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుండి రావాల్సిన 67 వేల కోట్ల మొండి బకాయిలను వెంటనే వసూలు చేసి సంస్థ ఖాతాలో జమ చేయాలి. గుర్తింపు సంఘం ఎన్నికలు సెప్టెంబర్ 9వ తేదీతో ప్రస్తుత గుర్తింపు కార్మిక సంఘం గడువు ముగిసినందున, సింగరేణిలో వెంటనే పారదర్శకంగా గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి.నెలలో 3 సార్లు వైద్య పరీక్షల మండలి: సంస్థలో వైద్య పరీక్షల మండలాలను నెలకు మూడుసార్లు నిర్వహించి, ఆరోగ్య సమస్యల వల్ల పనికి తగని వారిని గుర్తించడంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలి.

***ఆదాయ పన్ను మినహాయింపు:***

కార్మికుల భత్యాలపై విధించే ఆదాయ పన్నును రద్దు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలి.కదం తొక్కిన నాయకులుకార్మికుల సంక్షేమం, భద్రత రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ డిమాండ్లపై యాజమాన్యం ప్రభుత్వం వెంటనే స్పందించాలని నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కేంద్ర ఉపాధ్యక్షులు కూసాని వీరభద్రం,కొత్తగూడెం ప్రాంత ఉపాధ్యక్షులు గడప రాజయ్య, కొత్తగూడెం కార్యాలయ ఉపాధ్యక్షులు తుమ్మ శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ నాయకులు కిరణ్ కుమార్, గిన్నారపు మహేందర్,సురేష్,రాజేష్‌తదితరులు పాల్గొన్నారు.



# ఇది కాంగ్రెస్ ప్రభుత్వమా...కమిటీల ప్రభుత్వమా...?

- ఉద్యోగులను బాధనాం చేయడానికి రేవంత్ రెడ్డి ప్రయత్నం
- ఉద్యోగుల హక్కులపై ప్రభుత్వానికి చిత్తశుద్ధితో లేదు
- కమిటీల పేరుతో కాలయాపన...
- పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేసి,పీఆర్సీ అమలు చేయాలి
- సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి
- ఈహెచ్ఎస్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదు
- చిరు ఉద్యోగులు,కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి







**హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా :**

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో ఏర్పాటు సమావేశంలో మాట్లాడుతూ... ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏలను పెండింగ్‌లో ఉంచడం,పీఆర్సీని అమలు చేయడంలో జాప్యం చేయడం అంటే ప్రభుత్వమే ఉద్యోగుల హక్కులను నిలిపివేసినట్లేనన్నారు.డీఏలు చెల్లించాల్సింది ప్రభుత్వం,పీఆర్సీ అమలు చేయాల్సింది ప్రభుత్వం ,ప్రభుత్వం చెల్లించకుండా,అమలు చేయకుండా ఉండి...ఉద్యోగులు తమ హక్కులు అడిగితే వారినే తప్పుపట్టడం సరికాదని రాకేష్ రెడ్డి అన్నారు.ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన డీఏల అమలు,పీఆర్సీ, ఓపీఎస్,ప్రమోషన్లు తదితర హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో డీఏలు వరుసగా పెండింగ్‌లో ఉండటంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలన్నారు.ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో డీఏల పెండింగ్ పరిస్థితిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.12వ పీఆర్సీ అమలులో జరుగుతున్న జాప్యం తీవ్ర ఆందోళనకరమన్నారు. గత పీఆర్సీల అమలుకు పట్టిన సమయంతో పోలిస్తే ప్రస్తుత పీఆర్సీపై జరుగుతున్న జాప్యం అసాధారణంగా ఉందని పేర్కొన్నారు.ఉద్యోగుల వేతనాలపై ప్రభుత్వం చెబుతున్న లెక్కలకు,వాస్తవ పరిస్థితులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రభుత్వం ప్రజలకు వివరించాలన్నారు.డీఏల అమలుకు అయ్యే ఆర్థిక భారంపై ప్రభుత్వం వాస్తవ గణాంకాలను ప్రజల ముందుంచాలని,అలా చేయకుండా ఉద్యోగుల వల్ల ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందన్న నరేటివ్ ను ప్రజల మధ్య చర్చ పెట్టడం దుర్మార్గమన్నారు.ఒక డీఏ అమలు చేసేలోపు మరో డీఏ పెండింగ్‌లోకి వస్తుందని,కాబట్టి విడతల వారీగా కాకుండా పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏలను ఒకేసారి పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

***సీపీఎస్‌పై మళ్లీ కమిటీ ఎందుకు...?***

సీపీఎస్ సమస్య పరిష్కారానికి మరో కమిటీ ఏర్పాటు చేయడం అంటే కమిటీల పేరుతో కాలయాపన చేయడమే అవుతుందని విమర్శించారు.ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై ఇప్పటికే ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉన్నప్పుడు మళ్లీ కమిటీల పేరుతో సమస్యలను వాయిదా వేయడం వల్ల ఉద్యోగులకు ప్రయోజనం ఉండదన్నారు.ఉద్యోగ సంఘాలు తమ హక్కుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కమిటీలు వేయడం కాకుండా, సమస్యలకు కాలపరిమితితో కూడిన పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

***ఈహెచ్ఎస్‌ను వెంటనే పూర్తి స్థాయిలో అమలు చేయాలి...***

ఉద్యోగుల జీతాల నుంచి 1.5 శాతం జీతాన్ని ఈహెచ్ఎస్ కోసం మొత్తాలు కట్ చేస్తున్నప్పటికీ ,వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. ఆసుపత్రుల ఎంపానెల్,చర్చల పేరుతో మరింత జాప్యం చేయకుండా ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగుల జీతాల నుంచి ఇప్పటివరకు కట్ చేసిన మొత్తాల వినియోగంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

***రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..***

రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన పెన్షన్,గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్,ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు.పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమకు రావాల్సిన ప్రయోజనాల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

***చిరు ఉద్యోగులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి...***

రాష్ట్రంలో రూ.9 వేల నుంచి రూ.20 వేల వరకు స్వల్ప వేతనాలతో పనిచేస్తున్న అనేక మంది చిరు ఉద్యోగులు సంవత్సరాలుగా వేతన పెంపు కోసం ఎదురుచూస్తున్నారన్నారు.ఆశా వర్కర్లు,అంగన్‌వాడీ సిబ్బంది,గ్రామ పంచాయతీ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, హోంగార్డులు,104,108 సిబ్బంది,ఆర్పీలు,వీవోఏలు తదితర వర్గాల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.చిన్న వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగుల కుటుంబాల జీవన వ్యయం, పిల్లల విద్య,వైద్య ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో వారి వేతనాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

**ఉద్యోగుల హామీలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి....***

పీఆర్సీ,డీఏలు,ఓపీఎస్, ఈహెచ్ఎస్,రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు,చిరు ఉద్యోగుల వేతనాలు వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన టైమ్‌లైన్ ప్రకటించాలని రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు.ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకులు కాదు. వారు ప్రభుత్వ వ్యవస్థలో భాగం. తమ హక్కులు, తమ కుటుంబాల భద్రత కోసం వారు ప్రశ్నిస్తున్నారు.వారి సమస్యలను కమిటీలతో,వాయిదాలతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని అన్నారు..

ప్రభుత్వం ఉద్యోగులతో చర్చలు జరిపి, ప్రతి డిమాండ్‌పై నిర్ణయం తీసుకొని,అమలు చేయాల్సిన తేదీలను ప్రకటించాలని సూచించారు.ఉద్యోగులు, ఉపాధ్యాయులు,చిరు ఉద్యోగులు,కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది,రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు బీఆర్ఎస్ వారి తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని ఏనుగుల రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు.



# భక్తితో పాటు యువతతో కలిసి సర్పంచ్ దంపతుల జోష్

- అంగరంగ వైభవంగా శ్రీ వరసిద్ధి వినాయక శోభాయాత్ర
- వర్షాన్నిసైతం లెక్కచేయక డీజే పాటలకు సర్పంచ్ లావుడ్య పూర్ణ–పార్వతీదేవి స్టెప్పులు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**

రేగళ్ల పెద్ద తండా గ్రామపంచాయతీలో శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న గణనాథుడికి వినాయక నిమజ్జనం సందర్భంగా గ్రామస్తులు ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు.భారీ వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువకులు, మహిళలు, చిన్నారులు, గ్రామ ప్రజలు డీజే పాటల హోరులో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ "గణపతి బప్పా మోరియా" నినాదాలతో గ్రామ వీధులను మార్మోగించారు.

**ప్రత్యేక ఆకర్షణగా సర్పంచ్ దంపతుల నృత్యం:**

ఈ శోభాయాత్రలో రేగళ్ల పెద్ద తండా సర్పంచ్ లావుడ్య పూర్ణ-పార్వతీదేవి దంపతులు ప్రత్యేక ఉత్సాహంతో పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా యువతతో కలిసి డీజే పాటలకు ఆకట్టుకునేలా స్టెప్పులు వేసి సందడి చేశారు. సర్పంచ్ దంపతులు యువతతో కలసి ఉత్సాహంగా నృత్యాలు చేయడం శోభాయాత్రకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అనంతరం శ్రీ వరసిద్ధి వినాయక విగ్రహాన్ని భక్తిశ్రద్ధల నడుమ పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం గోదావరి నదికి తీసుకెళ్లి శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, వర్ధమాన యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేశారు.



# భద్రాచలంలో గణేష్ నిమజ్జన ఏర్పాట్లు పూర్తి

- కరకట్ట వద్ద భద్రతా చర్యలను పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్
- సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన

**భద్రాచలం, భద్రాద్రి బ్యూరో తెలంగాణ చౌరస్తా :**

భద్రాచలం కరకట్ట వద్ద నిర్వహించనున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి అన్ని రకాల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ ఏర్పాట్లను పటిష్టం చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ తెలిపారు. గురువారం నాడు సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఎస్పీ అరుణ్ కుమార్‌లతో కలిసి కరకట్ట నిమజ్జన పాయింట్ పరిసర ప్రాంతాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ..**

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిమజ్జనానికి ఎలాంటి అంతరాయం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తుల భద్రత కోసం నిమజ్జన ప్రాంతంలో గజ ఈతగాళ్లు, రెస్క్యూ టీమ్‌లు, వైద్య సిబ్బందిని నిరంతరం అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

***నిమజ్జన రూట్ ట్రాఫిక్ నిబంధనలు:***

ట్రాఫిక్ రూట్: భద్రాచలం బ్రిడ్జి ఐజీ సెంటర్ బస్టాండ్ అంబేద్కర్ సెంటర్ కూనవరం రోడ్ డిగ్రీ కాలేజ్ కరకట్ట నిమజ్జన పాయింట్ మార్గంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించనున్నారు.

***టపాసులపై నిషేధం:***

కరకట్ట నిమజ్జన పాయింట్ వద్ద బాణాసంచా/ టపాసులు కాల్చడంపై పూర్తి నిషేధం విధించారు.

***వాహనాలపై నియంత్రణ:***

నిమజ్జన పాయింట్‌కు వచ్చే వాహనాల్లో ఇద్దరికి మించి ఉండరాదని, నిర్దేశిత ప్రాంతాల్లోనే పార్కింగ్ చేయాలని స్పష్టం చేశారు.

**భద్రతా సూచనలు:**

నదిలోకి ప్రమాదకరంగా దిగడం, బారికేడ్లు దాటడం వంటి చర్యలకు ఎవరూ పాల్పడకూడదని హెచ్చరించారు.శాంతియుత వాతావరణంలో, పోలీసుల సూచనలు పాటిస్తూ నిమజ్జన వేడుకలను విజయవంతం చేయాలని శోభాయాత్ర నిర్వాహకులకు, భక్తులకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్డు రవాణా శాఖ అధికారులు, ఇతర శాఖల ప్రతినిధులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# గణేష్ నిమజ్జనానికి భారీ బందోబస్తు

- క్షేత్రస్థాయిలో పరిశీలించిన డిసిపి అనురాధ
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

**అబ్దుల్లాపూర్ మెట్ తెలంగాణ చౌరస్తా:**

వినాయక నిమజ్జన ఏర్పాట్ల సందర్భంగా ఎల్బీ నగర్ డిసిపి అనురాధ ఐపిఎస్ గురువారం అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని ఇనామ్ గూడ చెరువును సందర్శించారు.చెరువు పరిసర ప్రాంతాలలో పోలీసు శాఖ చేపట్టిన బందోబస్తు ఏర్పాట్లను ఆమె క్షేత్రస్థాయిలో సమీక్షించారు.ఈ పర్యటన సందర్భంగా డిసిపి అనురాధ, అబ్దుల్లాపూర్ మెట్ పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు,స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై ముఖాముఖి మాట్లాడారు.స్థానిక సమస్యలు,చెరువు వద్ద చేపట్టాల్సిన భద్రతా చర్యలు ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై వారితో చర్చించారు. భక్తులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.అనంతరం పోలీస్ సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.చెరువు వద్ద రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక నిఘా ఉంచాలని, సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం గస్తీ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్ సిఐ అశోక్ రెడ్డి, పిగిలిపూర్ గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, బలిజగూడ సర్పంచ్ ఉప్పు మాధవి నవీన్ కుమార్, అనాజ్ పూర్ సర్పంచ్ నవనీత మహేష్ తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం

- మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డికి ఆహ్వానం

**అబ్దుల్లాపూర్‌మెట్,తెలంగాణ చౌరస్తా:**

మండల సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో నేడు ఇనాంగూడ చెరువు వద్ద తలపెట్టిన వినాయక నిమజ్జన కార్యక్రమానికి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక ఆహ్వానం అందజేశారు.గురువారం మండల సర్పంచులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు, గండిచెరువు సర్పంచ్ జక్కా రవీందర్ రెడ్డి, అబ్దుల్లాపూర్ మెట్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, బలిజగూడా సర్పంచ్ ఉప్పు మాధవి నవీన్ కుమార్, ఇనాంగూడా సర్పంచ్ రాఘవేందర్ గౌడ్,అనాజ్ పూర్ సర్పంచ్ నవనీత మహేష్ పాల్గొన్నారు.

# కుంట్లూర్ ఎంకేఆర్ నగర్ కాలనీలో వైభవంగా గణేష్ నిమజ్జనం

**అబ్దుల్లాపూర్ మెట్,తెలంగాణ చౌరస్తా:**



జిహెచ్ఎంసి పరిధిలోని కుంట్లూర్ డివిజన్ ఎంకేఆర్ నగర్ కాలనీలో బొజ్జ గణపయ్య నిమజ్జన మహోత్సవం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా,కోలాహలంగా జరిగింది.కాలనీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో కాలనీవాసులు, మహిళలు,పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతోషంగా గడిపారు.ఈ సందర్భంగా స్థానికులు గణనాథునికి ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, పిల్లల ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. మంగళవాయిద్యాలు, చప్పుళ్ళు, డప్పు మేళాలు, యువకుల కేరింతల నడుమ వినాయక విగ్రహ శోభాయాత్ర కాలనీ వీధుల్లో ఘనంగా సాగింది. జై బోలో గణేష్ మహారాజ్ కి జై అంటూ భక్తుల జయజయధ్వానాల మధ్య వినాయకుడిని సాగనంపారు. ఈ కార్యక్రమంలో కాలనీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మద్ది శ్రీనివాస్ యాదవ్, మద్ది కుమార్ స్వామి యాదవ్, బయ్యపు సురేందర్ రెడ్డి, రమేష్ రెడ్డి, మన్యం శ్రీనివాస్,కపిల్ యాదవ్, బిట్ల శ్రీనివాస్ రెడ్డి, శ్రీను నాయక్,ముత్యాల, యాదగిరి తోపాటు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను అరెస్ట్ చేయాలి

- జక్కిడి శివచరణ్ రెడ్డి డిమాండ్

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

ఓట్ల తొలగింపునకు పాల్పడుతూ ఎన్నికల కమిషన్‌ను బీజేపీ ఏజెంట్ సంస్థగా మార్చారని ఆరోపిస్తూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయభాను చిబ్ పిలుపు మేరకు గురువారం జనగామ జిల్లా కేంద్రంలో తెలంగాణ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర సహాయ ఇన్‌చార్జ్ కె.ఆర్. భవ్యతో కలిసి పాల్గొన్న శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ..ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్లకు పైగా ఓటర్ల పేర్లను డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించి బీజేపీ లబ్ధి పొందేలా సీఈసీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు.ఫామ్ 6లో కొత్త నిబంధనలు తెచ్చి ఓటు చోరీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు క్రాంతి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అల్వాల కార్తీక్, చంద్రిక గౌడ్, ఉపాధ్యక్షుడు కమలాకర్, నాయకులు మహేశ్, బాబా, సంపత్, రాజేష్‌నాయక్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుకు ఘనస్వాగతం

- ఘనంగా స్వాగతం పలికిన గాండ్ల మోహన్
- కమాన్‌పూర్‌లో నూతన దుకాణాలను ప్రారంభించిన శ్రీను బాబు


**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

కమాన్‌పూర్ మండల కేంద్రంలో పర్యటించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబుకు పార్టీ శ్రేణులతో కలిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ ఘనస్వాగతం పలికారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్లాత్ స్టోర్ మరియు ఫెర్టిలైజర్ షాపుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయనకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్ ఆధ్వర్యంలో పూలమాలలతో ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం శ్రీను బాబు రిబ్బన్ కట్ చేసి ఈ వ్యాపార సముదాయాలను ప్రారంభించారు. దుకాణాల ప్రారంభోత్సవం అనంతరం, ఇటీవల రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన తులసి రామ్ గౌడ్‌ను దుద్దిళ్ల శ్రీను బాబు సమక్షంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి గాండ్ల మోహన్ శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శ్రీను బాబు నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ వైనాల రాజు, సింగిల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడప కృష్ణమూర్తి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రెబల్ రాజ్‌కుమార్, మైనార్టీ మాజీ అధ్యక్షుడు జావేద్, మండల కాంగ్రెస్ నాయకులు చొప్పరి శేఖర్, స్థానిక సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రుల సందర్భంగా ఆటల పోటీలు

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా :**

గణపతి నవరాత్రులసందర్భంగా వార్డు మెంబర్,ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ఏల్పుల గంగబుచ్చయ్య ఆధ్వర్యంలో వివిధ ఆటల పోటీలు నిర్వహించారు.ఈ పోటీల్లో స్థానిక యువత,మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను ఏల్పుల గంగా బుచ్చయ్య అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...గణపతి నవరాత్రులను పురస్కరించుకుని ప్రజల్లో స్నేహభావం,ఐక్యత పెంపొందించేలా ఇటువంటి కార్యక్రమాలు ప్రతీ యేటా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానికులు,యువత,మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# భక్తుల ఆగ్రహం.. అధికారుల నిర్లక్ష్యం

- నిమజ్జన వేడుకల్లో కాంగ్రెస్ వైఫల్యం
- బీజేపీ జిల్లా కార్యదర్శి గోకె వెంకటేష్




**వరంగల్ , తెలంగాణ చౌరస్తా:** వరంగల్ దేశాయిపేట చిన్న వడ్డపెల్లి చెరువు దగ్గర అధికారుల సమన్వయ లోపం వల్ల భక్తులకు ఇబ్బందులు తలెత్తాయని,నిమజ్జనంపై కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత కనిపిస్తుందని బీజేపీ వరంగల్ జిల్లా కార్యదర్శి గోకె వెంకటేష్ ఆరోపించారు. హిందూ పండుగల పై ఇంత వివక్షా ఎందుకని ,కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇతర మతాల పై ఉన్న ప్రేమ హిందువుల పై ఎందుకు లేదని ప్రశ్నించారు.తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ కనిపించడం లేదని,వరంగల్ గణేష్ నిమజ్జనాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు.హిందూ ఉత్సవాలపై కాంగ్రెస్ కక్షసాధింపు నశించాలని,వరంగల్ నిమజ్జనంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని మండిపడ్డారు.




# దేశ వ్యాప్తంగా మహిళలపై లైంగిక వేధింపులు దాడులు అరికట్టాలి

- ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.అశోక్ రెడ్డి

**తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:** ఢిల్లీ, బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో వరుసగా జరుగుతున్న ఘటనలు మహిళల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు.మహిళలపై దాడులు జరిగిన తర్వాత స్పందించడం, నిందితులను అరెస్టు చేయడం మాత్రమే కాకుండా ఇలాంటి ఘటనలు పునరవృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కే. అశోక్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఇంట్లోనే కాకుండా పాఠశాలలు, కళాశాలలు, పని ప్రదేశాలు, రోడ్లు, ప్రజా రవాణా, పార్కులు, పర్యాటక ప్రాంతాల్లో కూడా భద్రత లేకపోవడం ఆవేదన కలిగిస్తుందని అంటూ మహిళలకు ఎక్కడ రక్షణ ఉంది అని? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన ప్రశ్నించారు. దేశంలో మహిళపై ప్రతి 18నిముషాలకు ఒక రేప్ కేసు నమోదు అవుతున్నది అని మహిళలపై జరిగే లైంగిక దాడుల్లో బీజేపీపాలిత రాష్ట్రాలే ముందుభాగాన ఉన్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాలలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. మహిళలు భయపడకుండ స్వేచ్ఛగా, గౌరవంగా జీవించే హక్కును కల్పించాలని కోరారు. ఘటన జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, మహిళలపై హింసకు దారితీస్తున్న మూల కారణాలను గుర్తించి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి. పాఠశాలలు, కళాశాలల్లో స్త్రీ పురుష సమానత్వం, మహిళలను గౌరవించే సంస్కృతి, మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి. నగర శివారు ప్రాంతాల్లోని ఉన్న కళాశాలలు, పాఠశాలల పరిసరాల్లో పోలీస్ పెట్రోలింగ్ను పటిష్టం చేసి, విద్యార్థినుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు లెనిన్, భారత్, ప్రవీణ్, కార్తీక్ సాయి తదితరులు పాల్గొన్నారు.



# దానంకి సుప్రీం కోర్టులోను నిరాశే

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** పార్టీ ఫిరాయింపుల్లో భాగంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానం నాగేందర్‌పై అనర్హత వేస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహన్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం ఈ మేరకు తీర్పు వెలువరించింది. పదో షెడ్యూల్‌ను హైకోర్టు చట్టపరంగా సరైన రీతిలో అర్థం చేసుకుని తీర్పు ఇచ్చిందని ధర్మాసనం పేర్కొంది. అందులో జోక్యం చేసుకునే కారణం కనిపించడం లేదని తెలిపింది. దానం నాగేందర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదిస్తూ.. పదో షెడ్యూల్‌లోని 2(1)(బి) కింద పార్టీ విప్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన సభ్యుడి చర్యను పార్టీ క్షమించే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడానికి సంబంధించిన 2(1)(ఎ) నిబంధనకు ఈ మినహాయింపు వర్తించదని ధర్మాసనం స్పష్టం చేసింది. దానం నాగేందర్ చర్యను బీఆర్ఎస్ క్షమించలేదని ఆ పార్టీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆయనపై అనర్హత పిటిషన్ దాఖలు చేసింది కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యే నేనని వివరించారు. బీజేపీ ఎమ్మెల్యే తరఫు న్యాయవాది సైతం హైకోర్టు తీర్పును సమర్థిస్తూ దానం పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు.

**'ఆయారాం.. గయారాం.. ఫిర్ ఆయారాం'**

పార్టీ ఫిరాయింపుల అంశంపై వాదనలు జరుగుతున్న సమయంలో దానం నాగేందర్ తరఫు న్యాయవాది వాదనల నేపథ్యంలో ధర్మాసనం 'ఆయారాం.. గయారాం.. ఫిర్ ఆయారాం' అంటూ వ్యాఖ్యానించింది. ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి వెళ్లి, తిరిగి సొంత పార్టీలోకి వచ్చినట్లుగా దానం వ్యవహారాన్ని వివరిస్తున్నారా? అని ప్రశ్నించింది. ఈ సందర్భంగా పార్టీ విప్‌కు వ్యతిరేకంగా వ్యవహరించిన అంశానికి సంబంధించిన 2(1)(బి) నిబంధనను, పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవడానికి సంబంధించిన 2(1)(ఎ) నిబంధనతో కలిపి చూడలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునే కారణం లేదని పేర్కొంటూ దానం నాగేందర్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పు అమల్లోకి రానుంది. 2024 ఏప్రిల్ 23 నుంచి దానం నాగేందర్‌పై అనర్హత అమల్లోకి వస్తుందని హైకోర్టు గతంలో పేర్కొంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ అంశాన్ని ఆయన పార్టీ మారినట్టు పరిగణిస్తూ హైకోర్టు అనర్హతకు ప్రాతిపదికగా తీసుకుంది.

# వినాయకుడి సాక్షిగా విషాదాలు!

**వినాయక చవితిని దేశ వ్యాప్తంగా జరుపుకునే పండుగ. ప్రతి పండుగకు చరిత్ర ఉన్నట్లుగానే ఈ పండుగకు చరిత్ర, చారిత్రక నేపథ్యం ఉంది. ఏటా దేశవ్యాప్తంగా వీధివీధికి వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి వేడుకగా జరుపుతున్నారు. వినాయకుడు ఎప్పటి నుంచో ఉన్నాడు. కాని వినాయక చవితిని మన దేశంలో స్వాతంత్రోద్యమం కాలం నుంచి మరింత విస్తృతమైంది. ఈ పండుగ నాడు స్వతంత్ర కాంక్షను రగిలించేందుకు ఇది వేదికగా ఉపయోగపడింది. అయితే రానురాను ఇది వినోదానికి కేంద్రంగా మారింది. పండుగ వినోదాన్ని ఇవ్వాలి గాని, విషాదాన్ని ఇవ్వకూడదు.**



**వినాయక మండపాల చారిత్రక నేపథ్యం:**

వినాయక చవితి పండుగకు చాలా పురాతనమైన ఆధ్యాత్మిక సంప్రదాయం ఉంది. అయితే మనం ఇప్పుడు చూస్తున్నట్లుగా పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసి, ప్రజలందరూ కలిసి పూజించే బహిరంగ వినాయక మండపాల సంప్రదాయం మాత్రం ప్రధానంగా 19వ శతాబ్దం చివర్లో బలపడింది. లోకమాన్య బాల గంగాధర్ తిలక్ ఈ ఉత్సవాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రజలను ఒకచోట చేర్చి సామూహికంగా గణపతి పూజ నిర్వహించారు. కుల, వర్గ భేదాలకు అతీతంగా సామాజిక ఐక్యతను పెంచడం కోసం కృషి చేశారు. బ్రిటిష్ పాలన కాలంలో ప్రజల్లో సామాజిక, జాతీయ చైతన్యాన్ని పెంచడానికి ఒక వేదికగా ఉపయోగపడడం కోసం తిలక్ "వినాయక చవితి"ని ప్రారంభించారు.అని అంటుంటారు కానీ చారిత్రక ఆధారాలు ఏమీ లేవు.కాలక్రమంలో ఈ సంప్రదాయం దేశవ్యాప్తంగా విస్తరించింది. ఇప్పుడు మండపాలు ప్రధానంగా భక్తి, సామూహిక ఐక్యత, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం, సేవా కార్యక్రమాలు, ప్రజల భాగస్వామ్యం కోసం నిర్వహించబడుతున్నాయి. అంటే, వినాయక మండపం మొదట కేవలం విగ్రహం పెట్టే స్థలం కాదు ప్రజలు కలిసే సామాజిక, సాంస్కృతిక వేదికగా కూడా అభివృద్ధి చెందింది. ఈ సాంస్కృతి సంప్రదాయం తెలంగాణలో కూడా విస్తృతంగా విస్తరించింది. ఈ సంవత్సరం వినాయక చవితి ప్రారంభం నుంచి ఇప్పటి వరకు తెలంగాణ వ్యాప్తంగా అనేక విషాద సంఘటలు జరిగాయి. ఈ నిమజ్జనం అయిపోయే వరకు ఇంకా ఎన్ని విషాదాలు జరుగుతాయో ఊహించడమే భయంగా ఉంది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 25 మంది యువకులు చనిపోయారు. వీరంతా వినాయక మండపాన్ని ఏర్పాటు చేసే క్రమంలో విద్యుత్తు ఘాతానికి గురయ్యి చనిపోయిన వారు , లేదా నిమజ్జనం సందర్భంగా జరిగే పొరపాట్ల వల్ల విలువైన ప్రాణాలు కోల్పోయినవారున్నారు. సంగారెడ్డి జిల్లా పెద్దకంజర్ల గ్రామంలోని నేరేడు చెరువులో వినాయక విగ్రహ నిమజ్జనం సమయంలో ఆరుగురు విద్యార్థులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. తొమ్మిది మంది విద్యార్థులు నీటిలోకి వెళ్లగా ముగ్గురు బయటపడగా, ఆరుగురు లోతైన గుంతలో పడి మృతి చెందారు. మృతుల్లో పాఠశాల విద్యార్థి నుంచి ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థుల వరకు ఉన్నారు.ఇక హైదరాబాద్‌లో గణేష్ ఆగమన ఊరేగింపులో రాంనగర్ 19 ఏళ్ల బీటెక్ విద్యార్థి బద్రినాథ్ ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు.మరోవైపు, గణేష్ నిమజ్జనం కార్యక్రమం అనంతరం స్వగ్రామం నుంచి తిరిగి వస్తున్న కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం విషాదంలోకి నెట్టింది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని పాల్మాకుల వద్ద NH44పై కారు నిర్మాణంలో ఉన్న కల్వర్ట్‌ను ఢీకొనడంతో నలుగురు మృతి చెందారు.అలాగే కొంత మంది యాత్రలో డిజె సౌండుకు చనిపోవడం మరింత ఆందోళనకు గురి చేస్తుంది. డిజె డ్యాన్స్ లో గొడవలై చనిపోవడం భక్తి మార్గం పక్కదారి పట్టడానికి పరాకాష్ట.

ఒకప్పుడు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించేందుకు, అందరూ కలిసి సామూహికంగా ఆటలు ఆడుతూ, పూజలు చేస్తూ ప్రారంభమైన ఈ సంప్రదాయం నేడు వికృత రూపాన్ని సంతరించుకొని విషాదాన్ని మిగులుస్తుంది. ఒకనాడు అగ్రవర్ణాలకే పరిమితమైన ఈ విగ్రహ ప్రతిష్టను నేడు దళిత, బహుజన వాడలోకి వచ్చి యువతను తప్పుదారి పట్టిస్తుంది.

ఈ ఉత్సవాలు గ్రామీణ ప్రాంతాల కంటే, నగర, పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా నిర్వహించడం జరుగుతుంది. గ్రామాల్లో ప్రధానంగా నవరాత్రుల్లో పరిమిత సమయంలో ప్రజలు వినాయకుడిని దర్శించుకుని తమ రోజువారి పనుల్లోకి వెళ్లిపోతుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, కూలీలు, శ్రమజీవులు అధికంగా ఉండటంతో వారి జీవన విధానం, వ్యవసాయ పనులు, ఉపాధి అవసరాల కారణంగా ఎక్కువ రోజులు ఉత్సవాల్లో పాల్గొనే అవకాశం తక్కువగా ఉంటుంది.

కాని అదే సమయంలో నగర, పట్టణ ప్రాంతాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించిన మూడో రోజు నుంచి తొమ్మిదో రోజు వరకు, నిమజ్జనం జరిగే వరకు కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు మండపాలను సందర్శించే సంప్రదాయం ఉంది. ముఖ్యంగా మహిళలు, పిల్లలు కూడా ఉత్సవాల్లో పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు.

అయితే ఈ ఉత్సవాలు భక్తి, ప్రపత్తుల మాట అటుంచిభక్తులపై ఆర్థిక భారాన్ని మోపుతుంది. బస్తీలలో నివసించే దళిత బలహీన వర్గాల ప్రజలు మేమేమి తక్కువ కాదంటూ ఎంతటి ఆర్థిక భారాన్నైనా భరిస్తూ ఈ ఉత్సవాలలో మునిగి పోతున్నారు. కానీ ఈ ఉత్సవాల వెనుక మార్కెట్, కార్పొరేట్ శక్తులు ఉన్నాయడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే ఈ ఉత్సవాల వలన ఈ శక్తుల లాభాలు దాగి ఉన్నాయి. చైతన్యవంతమైన తెలంగాణ నేల పొరల నుంచి ఎదిగి వచ్చిన ఆలోచనపరులు, విద్యావంతులు, మేధావులు ఈ ఉత్సవాల ముఖ్యోద్దేశం గాని, ఉత్సవాల చుట్టు దాగి ఉన్న ఆర్థికపరమైన అంశాలను విడమర్చి తెలియజేయడంలో వీరు విఫలమైయారని చెప్పవచ్చు. ఈ పండుగ ముఖ్య ఉద్దేశాన్ని సమాజానికి అర్థం చేయించడంలో వైఫల్యం చెందారు. చైతన్యవంతమైన నేలకు ఈ దుస్థితి ఎందుకేర్పడిందో ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఎంతో ఉంది.ఈ ఉత్సావాల్లో ముఖ్యంగా బడుగు, బలహీన, మధ్యతరగతి వర్గాలకు చెందని యువకులే అత్యధికంగా పాల్గొంటున్నారు. వారి విలువైన సమయాన్ని, శక్తి సామర్థ్యాలను వృథా చేసుకుంటున్నారు. దేవుడి కోసం చేస్తే తప్పేటనే వాదన కూడా సమాజంలో ఉంది. దేవుడు ఎక్కడ కూడా తన కోసం ప్రజలను గాని భావి పౌరులను తన భవిష్యత్తును నాశనం చేసుకోమని చెప్పలేదు. ఈ ఉత్సవాల శబ్దాలకు వృద్ధుల, పసి పిల్లల ప్రాణాలు బలితీసుకోమని దేవుడు ఎక్కడ చెప్పలేదు. నేడు వినాయక చవితి ఉత్సవాలు బడుగు, బలహీన, మధ్యతరగతి వర్గాలకు చెందిన యువకుల మధ్య పోటీగా మారింది. ఈ పోటీలో కొంతమంది యువకులు ప్రాణాలు కోల్పోతున్నారు. పోటీ కారణంగా తమ శక్తికి మించి ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. భక్తి అనేది ఆర్థిక సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి మార్గం కాకూడదు. అప్పులు చేసి, కుటుంబ అవసరాలను పక్కనపెట్టి ఉత్సవాల కోసం ఖర్చు చేయడం వల్ల చివరకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులను చూస్తున్నాం.

ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో శాసనమండలి సభ్యులైన చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న) శాసన మండలిలో వినాయకుడి విగ్రహం నెలకొల్పడానికి చందాల కోసం బడుగు బలహీన వర్గాల యువకులు రోడ్ల మీద తిరుగుతూ అడుక్కుంటున్నారు. ఇందులో ఏ ఒక్కరు అగ్రవర్ణాలకు చెందిన పిల్లలు లేరని విషయాన్ని కూడా ప్రస్తావించారు. అంటే అగ్రవర్ణాలకు చెందిన యువకులు రాజకీయాలలో బీజీగా ఉంటే, దళిత, బహుజన పిల్లలు తమ అమూల్యమైన సమయాన్ని, జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంటే కింది వర్గాలకు చెందిన యువకులు అగ్రవర్ణాలకు చెందిన యువకులలాగా రాజకీయాలను ప్రభావితం చేయలేకపోతున్నరనే విషయాన్ని వ్యక్తపరిచారు.

ఇలాంటి ఆందోళనకరమైన పరిస్థితులు తెలంగాణలో కూడా రావడం బాధకరమైన విషయం అయినప్పటికిని తెలంగాణ యువతరం ఇలాంటి సందర్భాలలో విచక్షణతో ఆలోచించి వ్యవహారించాల్సిన అవసరం ఎంతో ఉంది. వినాయకుడిని ప్రతిష్ఠించడానికి ఉన్న ప్రధాన భావన "విఘ్నాలను తొలగించే దేవుడు" అనే విశ్వాసం. ఒకప్పుడు ప్రజలందరినీ ఒకచోట చేర్చి వారిని ఐక్యతను నడిపించే సామూహిక ఉత్సవంగా ఉన్న ఈ సంప్రదాయం. అది నేడు పిల్లల ఆనందం, భక్తి, ఉత్సాహంలో భాగంగా మరింత విస్తరించింది. అయితే ఆనందంగా జరుపుకోవాల్సిన ఈ ఉత్సవాలు కొన్ని సందర్భాల్లో విషాదాన్ని కూడా మిగులుస్తున్నాయి. ముఖ్యంగా నిమజ్జనం సమయంలో చెరువులు, కాలువలు, నదులు, వద్ద జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల యువత ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు బాధాకరం. తెలంగాణలో వినాయక చవితి సందర్భంగా ఆగామనం, నిమజ్జనం సందర్భంగా ప్రతి ఏటా పదుల సంఖ్యలో తెలంగాణ యువకులు ప్రాణాలు కోల్పోతూ ఉన్నారు. "విఘ్నాలు తొలగించుడు దేవుడెరుగు" కానీ అనేక కుటుంబాలు విషాదంలోకి నెట్టబడుతున్నాయి. ఈ విషాద సంఘటనలలో అట్టడుగు వర్గాల యువకులు మాత్రమే ప్రాణాలను కోల్పోతున్నారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని ఇకనైన తెలంగాణ ప్రభుత్వం నివారణ చర్యలను తీసుకుంటే బాగుండేది. అనేక కుటుంబాలలో విషాదాన్ని తప్పించి తెలంగాణ యువతరాన్ని కాపాడిన వారవుతారు



డా. ఆవాల హరిబాబు,
ఉస్మానియా యూనివర్సిటీ

# విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిమర్జణం

**మానకొండూరు, తెలంగాణ చౌరస్తా:** కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం లక్ష్మీపూర్ గ్రామంలో గణపతి మహా నిమర్జన ఘట్టం విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.మహిళలు, పురుషులు,పిల్లలు సంప్రదాయ వస్త్రాలను ధరించి నృత్యాలతో సంతోషంగా గడిపి ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా విగ్నేషుణ్ణి నిమర్జనం చేశారు.ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు రాపాక జగన్ మాట్లాడుతూ...ఆ గణనాథుడి ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆయురాగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరు జీవితంలో ఆ గణనాథుడు నీర్విఘ్నాలు తొలగించాలని విజయాలను అందజేయాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు రాపాక పెద్ద ఎల్లయ్య,ఈశ్వర్,రంగస్వామి,లక్ష్మణ్,రవీందర్,పులిపాక నరేష్,పారునంది ఎల్లయ్య,రాపాక శంకరయ్య,రంగస్వామి,జంగం అంజన్న,నాగరాజు,ఆంజన్న,అజయ్,పారునంది ఆంజనేయులు,రాపాక రాజేందర్,సంజయ్,హరీష్,దుర్గ ప్రసాద్,సంజయ్,శ్రవణ్, పారునంది అరవింద్,రాపాక సాత్విక్,ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

